చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గం

కడప అర్బన్ : కుప్పం నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రధాన ప్రతిపక్ష నాయకులు చంద్రబాబునాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్ షోలు, ప్రదర్శనలను నిషేధించిన జీవో అడ్డం పెట్టుకుని ప్రతి పక్ష నాయకుడిని తన సొంత నియోజకవర్గంలో తిరగకుండా అడ్డుకోవడం, గంటకుపైగా రోడ్డుపైనే నిలబెట్టడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. ఒకవైపు ముఖ్యమంత్రి సహా మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు యథేచ్ఛగా తిరుగుతూ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలపై నిషేధం విధించడం రాజ్యాంగ వ్యతిరేకం, చట్ట విరుద్ధం, పౌరుల ప్రాథమిక హక్కులకు ఇది విఘాతమని పేర్కొన్నారు. తక్షణం నల్ల జీఒను ఉపసంహరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా చంద్రబాబు పర్యటనను స్వేచ్ఛగా, శాంతియుతంగా జరగడానికి అనుమతించాలని పేర్కొన్నారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్‌లో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజుతో కలిసి జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు క్రమం తప్పకుండా రోజూ విధిగా వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేయాలన్నారు. వారి డ్యూటీ సమయానికి 15 నిమిషాలు ముందే ఆరోగ్యకేంద్రానికి చేరుకుని హాజరు వేసి కింది స్థాయి సిబ్బంది కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులకు సరిగా హాజరవ్వని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందే వైద్య సేవలు, వైద్యాధికారుల పనితీరు, ఆరోగ్య కేంద్రాల్లో ఓపిల నమోదు సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. గ్రామాల్లో కమ్యూ నల్ డిసీజెస్ కంట్రోల్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రోత్సహించడం, సుఖ ప్రసవాలు చేయడం, ప్రణాళిక ప్రకారం ఇమ్యునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతృ, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు, ఆరోగ్యశ్రీ పథకం అమలు, ఆయుష్మాన్ భారత్ అమలు తదితర ప్రక్రియలను చేపట్టడంలో పనితీరు ఆధారంగా ఆయా ఆరోగ్య కేంద్రాలకు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి ర్యాంకులను కేటాయిస్తారన్నారు. ఎఎన్ఎం, ఆశా, సిహెచ్ఓలతో ప్రతి వారం సమావేశం ఏర్పాటు చేసుకుని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేయాలని చెప్పారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల సీజనల్ డ్రగ్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. సిహెచ్‌ఓలు ఆరోగ్య అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన గర్భిణుల వివరాలను సేకరించి, నిర్దేశించిన సమయంలో పరీక్షలు చేసేలా తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వచ్చిన రోగులతో ఆప్యాయంగా పలకరించి వైద్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓలు, పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

మాట్లాడుతున్న డైరెక్టర్ బీమా రవిప్రకాష్‌రెడ్డి

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో బుధవారం లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలు జిల్లా వికలాంగుల, వయో వృద్ధుల శాఖ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బీమా రవి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఫ్రాన్స్ దేశంలో కుప్రే అనే మారుమూల గ్రామంలో జన్మించి అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆరు చుక్కలతో లిపిని రూపొందించారని చెప్పారు. ఎంతోమంది అంధ విద్యార్థుల్లో వెలుగులు నింపి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని చెప్పారు. రానున్న కాలంలో వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల పరికరాలు, వసతులు కల్పించే చర్యలు తీసు కుంటామని చెప్పారు. జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా అంధులకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకొని రానున్న కాలంలో విభిన్న ప్రతిభావంతులు మంచి స్థాయికి ఎదిగాలని ఆకాంక్షించారు. డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దివ్యాంగుల సంక్షేమ కోసం ఎన్నో పథకాల ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆయన తెలిపారు కార్యక్రమంలో వివిధ పోటీలలో ప్రతిభ చూపిన అంధ విద్యార్థులకు రాష్ట్ర డైరెక్టర్‌చే బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్, దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య, వెంకటరమణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

గృహ నిర్మాణ లక్ష్యాన్ని ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా లతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి,మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఓటీఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్ తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ.. నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా.. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. **సంక్షేమ హాస్టళ్లను సొంత బాధ్యతతో చేపట్టాలి** సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎలాంటి వేధింపులకు గురికాకుండా సొంత బాధ్యతతో సంరక్షించాలని అధికారులను, వార్డెన్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లల్లో పిల్లల పట్ల వార్డెన్లు కానీ, బయటి వారు కానీ, అక్కడ పని చేసే వర్కర్లు కానీ అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక, మానసిక వేధింపులకు గురి చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10లోపు కమిటీలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల పది లోపు పార్టీ కమిటీలు పూర్తి చేయాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు బుధవారం కడప పార్లమెంటు నియోజక తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు మేకల బాబు అధ్యక్షతన, పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ వికాస్ హరి, టిడిపి రాష్ట్ర బిసి జంగం సాధికార సమితి కన్వీనర్ కొండపల్లి ఉమాకాంత్, రాష్ట్ర బిసి బెస్త సాధికార సమితి కన్వీనర్ రామ్ ప్రసాద్,స్టేట్ కన్వీనర్ నరసింహులు, రాష్ట్ర నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ కమిటీలన్నీ పూర్తిచేయాలని నిర్ణయించారు. పార్లమెంటు స్థాయిలో ఉన్న అసెంబ్లీ, నియోజకవర్గం కమిటీ సభ్యులు హాజరుకావాలని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషిచేసి నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి అయ్యేంతవరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ కో-ఆర్డినేటర్, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యానాదుల ఉద్యోగుల సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, సంఘం నాయకులు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శాప్ డైరెక్టర్ డేనియల్

క్రీడలు ఐక్యతకు సంకేతం : శాప్ డైరెక్టర్

కడప అర్బన్ : విద్యార్థులు, యువత, చెడు మార్గాల జోలికి వెళ్లకుండా ఉండాలంటే క్రీడలను ప్రోత్సహించాలని , ఐక్యతకు సాంకేతికమని శాప్ డైరెక్టర్ డేనియల్ అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు యువత ప్రాధాన్యత ఇవ్వడం కారణంగా గంజాయి స్టెరాయిడ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటారన్నారు. ప్రాథమిక విద్య నుంచే ప్రాథమిక పాఠశాలలోనే క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలన్నారు. సంక్రాంతి సంబరాలలో ఈ క్రీడా పోటీలు డివైఎఫ్ఐ నిర్వహించటం చాలా సంతోష దాయకమని అభినందించారు. సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, ఐద్వా నగర కార్యదర్శి జమీల మాట్లాడుతూ క్రీడలలో నైపుణ్యం సంపాదించుకుంటూ సమాజంలో జరుగు తున్న మంచి చెడులను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. చెడుకు దూరంగా మంచికి దగ్గరగా ఉంటూ మంచి సమాజాన్ని నెలకొల్పాలని క్రీడాకారులకు, విద్యార్థులకు, యువతకు విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి సందర్భంగా వివిధ రకాల ఆటలు, కళారూపాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. పోటీల నిర్వహణ కమిటీ ఆర్గనైజర్ గా డి.ఎం. ఓబులేసు, అంపైర్స్‌గా విజయ భాస్కర్, సందీప్, రవి కుమార్, స్కోర్ డిపార్ట్‌మెంట్ విజయ్ కుమార్, వినోద్ వ్యవహరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

టెండర్లు ఆహ్వానం

కడప సిటీ : జిల్లాలోని 8 వైద్య విధానపరిషత్ (ఎపివివిపి)ల్లో ఇన్ పేషంట్లకు డైట్ సరఫరా చేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి టెండర్లు ఆహ్వాని స్తున్నామని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.kadapa.nic.inలో సంప్రదించాలని తెలిపారు.

ఆదాయ పన్ను పరిమితి పెంచాలి : ఆపస్

కడప అర్బన్ : ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టే యూనియన్ బడ్జెట్‌లో రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు ఆదాయ పన్ను పరిమితి పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం జిల్లా అధ్యక్షులు పోగుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ పన్ను పరిమితిని 2014 నుంచి ఇంతవరకు మార్పు చేయలేదని చెప్పారు. వేతన జీవులు పన్ను చెల్లింపు కింద ఒక నెల జీతాన్ని చెల్లిస్తున్నారని తెలిపారు. తద్వారా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, పన్ను చెల్లింపు తర్వాత జూనియర్ల జీతం కన్నా సీనియర్ల జీతం తక్కువగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడుదాం : టిడిపి

కడప అర్బన్ : అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్రం గాడిలో పడాలంటే వైసిపికి చరమగీతం పాడి టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో ఇదేమిఖర్మ రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పంలో చంద్రబాబు నాయుడు పర్యటన అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. వైసిపి అరాచక పాలన గురించి ప్రజలకు వివరించారు. జగన్‌ను నమ్మి ఓటు వేసిన జనం రాష్ట్రానికి ఇదేమి ఖర్మరా బాబు అంటూ వాపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, కడప నియోజకవర్గ ఇన్చార్జి వి.ఎస్ అమీర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి బి. హరి ప్రసాద్ యస్. గోవర్ధన్ రెడ్డి, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి,పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, మైనార్టీ నాయకులు జమీల్ మొబైల్ బర్కతుల్లా, పార్లమెంట్ ఎసి సెల్ మాజీ అధ్యక్షులు ఇట్టా ఈశ్వరయ్య, నగర ప్రధాన కార్య దర్శి జలతోటి జయకుమార్, నగర మహిళ అధ్యక్షురాలు మురికినాటి సునీత, వెయ్యల ప్రణవతి, బుర్రి రెడ్డయ్య యాదవ్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఓబులేసు పాల్గొన్నారు. **వల్లూరు :** రాష్ట్రానికి పట్టిన ఖర్మను వదిలించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి అ న్నారు. మండలంలోని దిగువ పల్లెలోనియోజకవర్గ పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వ హిం చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి రాఘవరెడ్డి, రమణారెడ్డి, రామ చంద్రారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గంగిరెడ్డి, మోహన్‌రెడ్డి తిమ్మారెడ్డి, పుల్లారెడ్డి, సదాశివారెడ్డి, సుబ్బారెడ్డి, చంద్ర ఓబుల్ రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

కడప : వైసిపి ప్రభుత్వంలో పేద బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని 43 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ పి. శ్రీలేఖ, ఇన్‌ఛార్జ్ పి. రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలోరవీంద్రనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఎస్. ముంతాజ్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా, కార్పొరేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం

కడప అర్బన్ : కడప, అన్నమయ్య జిల్లాల్లో పదవ తరగతి, ఇంటర్ పరీక్ష ఫీజులను ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా అధికంగా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. అంకన్న, జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న పిడిఎస్‌యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నగర నాయకులు పాల్గొన్నారు.

కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్షాల నాయకులు

చీకటి జీవోపై హోరెత్తిన నిరసనలు

- జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన
- తక్షణమే రద్దు చేయాలని ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజాగ్రహంతో రోడ్లపైకి వస్తున్న జనాన్ని చూసి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ బెంబేలెత్తిపోతున్నారని, ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతుకలను అణచివేసే విధంగా జారీ చేసిన నంబర్ ఒకటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష పార్టీల, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం, టిడిపి, కాంగ్రెస్, జనసేన, బిఎస్‌పి, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ, ఆర్ఎస్‌పి, సిపిఐ ఎమ్-ఎల్ లిబరేషన్, న్యూ డెమొక్రసీ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నల్లజెండాలతో ఆందోళన చేశారు. చీకటి జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. నిరంకుశ నిర్ణయాలతో పాలన కొనసాగిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నేత శ్రీనివాసరెడ్డి, సిపిఐ వెంకట శివ, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ నేత సత్తార్, టిడిపి నాయకులు అమీర్ బాబు, హరి ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, శివ కొండారెడ్డి హెచ్చరించారు. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో 1861లో చేసిన పోలీస్ చట్టంలోని నిబంధనలను ఇప్పుడు వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ బాధితులు, ప్రతిపక్షాలు రోడ్లపైకి వస్తుండడంతో అధికారపక్షంలో అభద్రతాభావం పెరిగిందని చెప్పారు. ఆరంభంలోనే ప్రభుత్వ వైఫల్యాలను పత్రికలు, మీడియా బయటపెడుతున్నాయనే కక్షతో జీవో నెం.2430 తెచ్చిన వైసిపి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా ప్రతి పక్షాలు, ప్రజా సంఘాలు నోరెత్తకుండా చేయాలనే ఉద్దేశంతో జీవో తెచ్చారని మండిపడ్డారు. ఇప్పటికే ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆగ్రహానికి ప్రభుత్వం గురైందని వారందరిని అనేక ఇబ్బందులకు గురి చేస్తూ దుర్మార్గంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వ లోపాలను, అన్యాయాలను, అవినీతిని, ప్రజా సమస్యలను ఎండగడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రజలకు కల్పించే హక్కుల సాధనకు ఆయుధంగా ఉన్న ఉద్యమాలను అణగదొక్కేందుకు జగన్ కంకణం కట్టుకోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన సభలు, సమావేశాలకు, పాదయాత్రకు అనుమతి ఇవ్వకుంటే జగన్‌రెడ్డి ఇంట్లో నుంచి కాలు బయటపెట్టేవాడా అని నిలదీశారు. ప్రభుత్వ వేధింపులకు, ఆంక్షలకు, అరెస్టులకు,కేసులకు, జైళ్ళకు భయపడేది లేదన్నారు. అన్ని వర్గాల ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాలు కొనసాగుతాయన్నారు. తక్షణమే చీకటి జీవోను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజాగ్రహానికి ప్రభుత్వం గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాగ సుబ్బారెడ్డి, సిపిఎం నాయకులు నారాయణ, రామ్మోహన్, దస్తగిరి రెడ్డి, బిఎస్‌పి గుర్రప్ప, లోక్ సత్తా శ్రీకృష్ణ, ఆర్ఎస్‌పి సుబ్బరాయుడు, లిబరేషన్ నాయకులు రమణయ్య, ఆప్ నేత శ్రీనివాసులు, మగ్బుల్, రవిశంకర్‌రెడ్డి, శంకర్, జనసేన గౌస్, టిడిపి నాయకులు వికాస్ హరి, జిలాని, శివరాం, సుబ్బయ్య సిపిఐ నాయకులు మద్దిలేటి, మనోహర్ రెడ్డి, మల్లికార్జున, భాగ్యలక్ష్మీ, బ్రహ్మం, సుబ్బరాయుడు, లింగన్న, నాగరాజు, భద్రయ్య హేతువాద సంఘం నాయకుడు సి ఆర్ వి ప్రసాద్, అన్వేష్, రాహుల్ పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక సిపిఎం కార్యాలయం దగ్గర సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జీవో నెంబర్ 1 కాపీలను నాయకులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు చాంద్ బాషా, పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్, గిలక రాజు, వెంకట రామయ్య, గోపవరం మండల కన్వీనర్ ఎస్.కె ఖాదర్ బాష, నాయకులు చంద్రశేఖర్, సుబ్బయ్య , సుబ్బరాయుడు, జయరామయ్య, వెంకటయ్య పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** పాతబస్టాండ్ వద్దనున్న గాంధీ విగ్ర హం వద్ద సిపిఎం జమ్మల మడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ ఆధ్వర్యంలో జీవో కాపీని దగ్ధం చేశారు. కార్యక్ర మంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సిపిఎం నాయకులు దాసు ప్రసాద్ రెడ్డి, నరేంద్రబాష, మన్సూర్ కమల్‌బాష పాల్గొన్నారు. **పోరుమామిళ్ల:** సిపిఎం మండల కార్యదర్శి ఎన్. బైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట జీవో కాపీని దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గౌసియాభేగం, వరలక్ష్మమ్మ, కంట శ్రీనివాసులు, బీబీ లూర్దుమేరి, రవి, బాల గురయ్య, ప్రసాదు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నంబర్ 1ని వెంటనే ఉపసం హరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్వర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడిగి శ్రీను, ముజాహిద్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలి యజేశారు. అనంతరం తహశీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి కుంద వరం సాల్మన్, కోశాధికారి రాఘవేంద్ర, సిఐటియు నాయకులు ఫకీరయ్య, ఉపాధ్యక్షులు ప్రమీలమ్మ ,రమాదేవి, గుర్రమ్మ, మరియమ్మ పాల్గొన్నారు. **కలసపాడు :** సిపిఎం మండల కార్యదర్శి ఎస్. గురవయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 1ని తక్షణమే ఉపసంహరించాలని నిరసన తెలిజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు. **కడప :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీవో నెంబర్ వన్ వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, బీసీ సెల్ జిల్లా చైర్మన్ కులయప్ప, నగర ఉపాధ్యక్షుడు మధు రెడ్డి, సూర్యుడు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

బద్వేల్: జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

పోరుమామిళ్లలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్నకాంగ్రెస్ నాయకులు నీలిశ్రీనివాసరావు

9 నెలల లోపు పిల్లలకు టీకాలు : డిఎంహెచ్ఒ

చింతకొమ్మదిన్నె : పుట్టిన 6 వారాలకు ఒకసారి, 14 వారాలకు 9 నెలలకు ఒకసారి ఫ్రాక్షన్ ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ ప్రాథమికదశలో వేయించాలని డిఎంహెచ్ఒ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో దాదాపు 20 మందికిపైగా చిన్నారులకు వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్‌ను చింతకొమ్మదిన్నెలో ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత కాలంలో చిన్నపిల్లల్లో పోలియో వ్యాధి వివిధ రూపాంతరాల్లో వ్యాప్తి చెందకుండా కాపాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ ఉమామహేశ్వర్, డిఐఒ మల్లేశ్వరి, వైద్యులు రాఘవేందర్ రెడ్డి, సునీత, మోహన్ రెడ్డి, షణ్ముగం పాల్గొన్నారు.

టీకా వేయు పద్ధతిని పరీక్షిస్తున్న డిఎంహెచ్ఒ

చిన్నారిని కాపాడిన అటవీ శాఖాధికారులు

పోరుమామిళ్ల : అడవిలో తప్పిపోయిన చిన్నారిని అటవీ శాఖ ఆధ్వర్యంలో కాపాడమని పోరుమామిళ్ల రేంజ్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా అటవీ అధికారి సందీప్ రెడ్డి ఆదేశాల మేరకు రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో టేకూరుపేట బీట్ పరిధిలోని బుచ్చంపల్లి గ్రామం కవలకుంట్ల రిజర్వు అడవిలో మంగళవారం సాయంత్రం వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి తన కుమారుడు సందీప్‌ను అడవిలోకి పశువులను వెళ్లాడు. ఆ సమయంలో కుమారుడు కన్పించకపోవడంతో మొబైల్‌పార్టీ కృష్ణయ్య తన సిబ్బందితో కలిసి అడవిలో గ్రామస్తుల సహకారంతో రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో బాలుడిని వెతికి పట్టుకొని తల్లి దండ్రులకు అప్పగించారు.

నేడు కొత్త పింఛన్లు పంపిణీ

చెన్నూరు : మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కమలాపురం ఎంఎల్ఎ పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి చేతుల మీదుగా ఈనెల 5న పంపిణీ చేయనున్నట్లు ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లను అందజేస్తున్నామని చెప్పారు. ఏ ఒక్క పింఛనూ తొలగించలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవ్వాతాతలు, వికలాంగులు పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ఆ పరిస్థితి ఇప్పుడు లేదని చెప్పారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప : జాతీయ లోక్ అదాలత్‌ను ఫిబ్రవరి 11న జిల్లా వ్యాపితంగా నిర్వహించనున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మొదటి అదనపు జడ్జి సి.ఎస్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందాలని కోరారు పూర్తి సమాచారం కోసం 08562 258622, వాట్సాప్ 9573269640, ఈమెయిల్ districts.ecourts.gov.in/Kadapa ద్వారా సంప్రదించగలరని తెలిపారు.

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- చైర్మన్‌గా విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మహమ్మద్ ఇర్షాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం సిఎస్ఐ ఉన్నత పాఠశాలలో రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఇక్బాల్ ఆధ్వర్యంలో ఎన్ను కున్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గా మాదన విజయ కుమార్ (యుటిఎఫ్), ప్రధాన కార్యదర్శిగా షేక్. మహమ్మద్ ఇర్షాద్ (రూటా), కో- చైర్మన్‌గా జె.రామచంద్ర బాబు(బిటిఎ), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎస్.భాస్కర్ రెడ్డి(ఎపిటిఎఫ్ 257), ఆర్ అబ్దుల్లా (ఎపిటిఎఫ్ 1938), వి.వంశీకృష్ణ (హెచ్ఎంఎ) ట్రెజరర్‌గా జి.చెన్నకేశవరెడ్డి (ఎస్టియూ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని, అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానం-2020 అమలు పేరుతో, పాఠశాలలను విలీనం చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే వివిధ కార్యక్రమాలను రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యా యులకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

8న బద్వేలులో జిల్లా వర్క్‌షాప్ : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లాస్థాయి వర్క్ షాప్ ఈనెల 8న బద్వేలులో నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, నాయకులందరూ బద్వేల్‌లో నిర్వహించే వర్క్ షాప్‌లో పాల్గొంటారని అన్నారు. ప్రధానంగా జిల్లా లో నిరుద్యోగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన కోసం చర్చిస్తామన్నారు. సమావేశంలో విజయ్, పవన్, మహేష్, రాహుల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చెన్నూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌తోపాటు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎంపిడిఒ సురేష్‌బాబ, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా పింఛను దారుడు మరణిస్తే వారి రేషన్‌కార్డులు పేరు తొలగించి అతని భార్యకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒకరికీ పెన్షన్‌తో పాటు సంక్షేమ పథకాలు కూడా వర్తించేలా అధికారులు చొరవ తీసుకో వాలన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణ విషయంలో అధికారులు ఆయా గ్రామ సచివాలయ పరిధిలో ప్రతి శనివారమూ పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గంగాధర్, గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, విఆర్ఒలు, వాలంటీర్లు పాల్గొన్నారు

ప్రయివేటీకరణకు వ్యతిరేకం : జెఎసి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మహారాష్ట్రలో విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరణ చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని, దాన్ని వ్యతిరేకిస్తున్న అక్కడ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు చేస్తున్న నిరసనకు తాము మద్దతి స్తున్నామని ఆర్‌టి పిపి కాంట్రాక్ట్ కార్మి కుల జెఎసి నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు వారు బుధవారం ఆర్‌టి పిపి పంప్‌హౌస్ మెయిన్ గేట్ వద్ద నినా దాలు చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల జాతీయ కమిటీకి మద్దతుగా ఎన్‌సిసిఒఇఇఇ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. పవర్ జెఎసి నాయకులు, కాంట్రాక్ట్ కార్మికుల జెఎసి నాయకులు కలిసి కట్టుగా పనిచేసి తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు. అందరి డిమాండ్లు నెరవేరాలంటే ఎవరి వంతు వారు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

మళ్లీ జగన్‌ను సిఎం చేయడమే లక్ష్యం

- జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

2024 ఎన్నికల్లో మళ్లీ సిఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయడమే లక్ష్యమని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యవర్గ సమావేశానికి భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1500 మందికిపైగా సర్పంచులు గురువారం సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. సర్పంచుల్లో మొత్తం 95 శాతం మంది వైసిపి వారేనని తెలిపారు. మరోమారు ఎన్నికల్లో వైసిపి గెలిపించే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు.

చిన్నారులకు టీకాలే శ్రీరామరక్ష

ప్రజాశక్తి - ఖాజీపేట

చిన్నారులకు టీకాలే శ్రీరామరక్ష అని వైద్య విస్తరణాధికారి రాఘవయ్య, నాగ భూషణం తెలిపారు. మండల పరిధిలోని పుల్లూరు సచివాలయంలో బుధవారం 104 వైద్య శిబిరం, పత్తూరు సచి వాలయంలోని పత్తూరు మెయిన్ గ్రామం అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీకాలు ప్రతి సచివాలయం, అంగన్వాడీ కేంద్రంలోనూ, ప్రతి శనివారం, బుధవారం తమ తమ గ్రామాలకు వైద్య సిబ్బంది వచ్చినప్పుడు తప్పనిసరిగా బిడ్డలకు టీకాలు వేయించాలని సూచించారు. మండలంలో కొత్తపేట సచివాలయంలో ఆశ నోడల్ పర్సన్, సూపర్‌వైజన్ కృష్ణప్రియ, ఖాజీపేట-1లో సిహెచ్ఒ కార్యక్రమంను పరువేక్షించారని రాఘవయ్య, నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి మౌలిక, ఎఎన్ఎం విజయమ్మ, 104 డాక్టర్ అర్బజ్ ఖాన్, డిఇఒ లలిత, ఆశా కార్యకర్తలు వసంతకుమారి, నూర్జాహన్ పాల్గొన్నారు.

టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

మాట నిలబెట్టుకున్న సిఎం

ప్రజాశక్తి - కొండాపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఎంతవరకైనా కృషి చేస్తారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. కొండాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కొత్తగా మం జూరైన పింఛనులను పం పిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆయన ముం దుగా కేక్ కట్ చేసి వృద్ధు లకు తినిపించారు. అనం తరం ఎమ్మెల్యే మాట్లా డుతూ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పింఛను పెంచా రన్నారు. పింఛన్ కోసం పడిగాపులు కాయకూడదని, ఇంటి వద్దకే తెచ్చిచ్చే సౌకర్యాన్ని ఏర్పాటు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను ఇస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గతంలో పరిపాలన చేసిన విధానాన్ని అనుకరిస్తూ పేదల కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, ఎంపిడిఒ శశిధర్‌రెడ్డి, ఎంఇఒ ఓబులేసు, ఎంపిపి లక్ష్మిదేవి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జడ్‌పిటిసి శేఖర్, చింతా రాజారెడ్డి, పెద్దిరెడ్డి, రామమునిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఏటూరు సూర్యనారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బురుజుపల్లెలో గడపగడపకు మన ప్రభుతం కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమాజంలో అన్ని వర్గాల శ్రేయస్సుకు కృషి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సమాజంలోని అన్ని వర్గాల వారి శ్రేయస్సు కోసం కృషి చేసే ఏకైక పార్టీ మహాజన సోషలిస్టు పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వై.చిన్నయ్య మాదిగ పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి) 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వై.చిన్నయ్య మాదిగ జెండాను ఎగరవేశారు. అనంతరం చిన్నయ్య మాదిగ మాట్లాడుతూ కృష్ణ మాదిగ నాయకత్వంలో సమాజంలో అన్ని వర్గాల శ్రేయస్సు కోసం దండోరా పోరాటం చేసిందన్నారు. ఆయన స్థాపించిన మహాజన సోషలిస్ట్ పార్టీని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల వారు ఆదరించాలన్నారు. ఎంఎస్‌పి జిల్లా నాయకులు సబ్బగాళ్ల నరసింహులు మాదిగ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, వృద్ధులు, వితంతువులు, విభిన్నప్రతిభావంతుల పింఛన్లు సాధించిన ఘనత కష్ణమాదిగదేనని తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు దాసు మాట్లాడుతూ కృష్ణ మాదిగ నాయకత్వంలో దళితులకు రాజ్యాధికారం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులు చంద్ర, గురుశేఖర్, ఓబయ్య, పుల్లయ్య, పెద్దులయ్య, పెద్దన్న, బాల ఓబయ్య, గంగన్న, ఓబన్న, సుబ్బారాయుడు, దస్తగిరి, మేసా గోపాల్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించి, నినాదాలు చేస్తున్న ఎంఎస్‌పి నాయకులు

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వేంపల్లె : మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామ సమీపంలో నాటుసారా తయారీకి సంబంధించిన 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు మండలంలోని బక్క న్నగారిపల్లె గ్రామ సమీ పంలోని అటవీ ప్రాంతంలో సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊట కనబడడంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు చేపడితే అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 10 లీటర్ల నాటుసారాను కూడా స్వాధీనం చేసుకొని వెంకటయ్య నాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు తిరుపాల్ నాయక్, రఘురాం, ఎస్‌బిఐ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కెసి నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన ఏదీ?

ప్రజాశక్తి - చాపాడు

రబీలో పంటలు సాగు చేసుకొనే రైతులకు సాగునీటి అవసరాల కోసం కెసి కెనాల్ అధికారులు నీరు ఎంతవరకు విడుదల చేసే దానిపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని రైతుల కోరుతున్నారు. కెసి కెనాల్‌కు ప్రస్తుతం నీటి సరఫరా కొనసాగుతోంది. ఆగస్టు రెండవ వారంలో కెసి కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువకు మార్చి చివరి వరకు లేదా ఏప్రిల్ వరకు నీరు వస్తే మళ్లీ రెండో పంటగా వరి, ఆరు తడిపంటలు సాగు చేసుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. ఎప్పటి వరకు కెసి కెనాల్‌కు నీరు వస్తుందో అధికారులు మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది కూడా జనవరికి నీరు నిలుపుదల చేస్తామని ముందుగా ప్రకటించినప్పటికీ మార్చి చివరి వరకు నీరు వచ్చింది. అయితే అధికారుల నుంచి ప్రకటన లేకపోవడంతో రైతులు ఎలాంటి పంటలు సాగు చేయలేదు. నీరు వృథాగా పోవాల్సి వచ్చింది. ఈ ఏడాదైనా కెసికి నీరు ఎప్పటి వరకు వచ్చేది స్పష్టమైన ప్రకటన చేస్తే రైతుల పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో 16 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. నీరు విడుదల చేస్తే 10వేల ఎకరాల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు అయ్యే అవకాశం ఉంటుంది. కుందూ పరిధిలోని రైతులు మాత్రం ఎలాగైనా నీరు వస్తుందన్న నమ్మకంతో వరి పంటను సాగు చేపడుతున్నారు. కెసి కెనాల్ పరిధిలోని రైతులు మాత్రమే అధికారుల ప్రకటన కోసం వేచి ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారం రోజుల్లోగా ప్రకటన విడుదల చేస్తే పూర్తిస్థాయిలో పంటలు సాగు చేసుకొనే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు కాస్త ఊరటగా ఉన్నారు. మళ్లీ పంటలు సాగు చేసుకునే ఉత్సాహంలో ఉన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులతో చర్చించి నీటిని విడుదల చేయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

కెసి కాలువలో ప్రవహిస్తున్న నీరు

జగన్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయ్ : టిడిపి

మాట్లాడుతున్న లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని జిల్లా టిడిపి అధ్యక్షులు లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆయన కార్యాలయంలో బుధవారం లింగారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతులను అణదొక్కేందుకే రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబర్ 1ని జారీ చేసిందన్నారు. సిఎం జగన్ నిరంకుశ నిర్ణయాలతో పాలన కొన సాగిస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రభుత్వ వైఫల్యాలను పత్రికలు, మీడియా బయటపెడుతున్నాయనే కక్షతో జిఒ 2430 తెచ్చారని, ఇప్పుడు ఏకంగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు నోరెత్తకుండా చేయాలనే ఉద్దేశ్యంతో జిఒ1 తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం దుర్మార్గమన్నారు. ఉద్యమం అనే మాట ఎంతో పవిత్రమైందన్నారు. ప్రభుత్వ అన్యాయాలను, అవినీతిని, ప్రజా సమస్యలను ఎండగడుతూ ప్రజాస్వామ్యం ప్రజలకు కల్పించే హక్కుల సాధనకు ఆయుధంగా ఉన్న ఉద్యమాలను అణగదొక్కేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సభలు, సమావేశాలు, రోడ్ షోలకు ప్రజల నుంచి అశేషమైన ప్రజాదరణ వస్తుండడంతో చూసి ఓర్చుకోలేకే జిఒ1తో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ప్రజా గొంతుకను అణిచివేయాలనే ఈ ప్రయత్నానికి వ్యతిరేకంగా ఏమి చేసినా లక్షలాది మందిగా సభలకు వస్తాం, రోడ్డెక్కుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సుంకర వేణుగోపాల్, సానా విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బయ్య, సిద్దయ్య, ఏసుదాసు, సుబ్బరాజు పాల్గొన్నారు.

మైదుకూరు : జిఒ 1ని వెంటనే రద్దు చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గడ్డా గురప్ప డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతులను అణదొక్కేందుకే రాష్ట్ర ప్రభుత్వం జిఒ 1ని జారీ చేసిందన్నారు. సమావేశంలో టిడిపి మైనార్టీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అల్తాఫ్ పాల్గొన్నారు.

అంధత్వం శరీరానికేగానీ.. మనసుకు కాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

'అంధత్వం శరీరానికేగారీ మనసుకు కాదు.. జీవితంలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలని పేదరికాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో డబుల్ ఎంఎ పూర్తి చేసి ప్రొద్దుటూరు మండలం మత్యకాలనీలో ఉపాధ్యాయుడిగా కొనసా గుతున్నాన' అని అంధ ఉపాధ్యాయుడు నీలం ఈశ్వరయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. చాపాడు మండలం వెదురూరు రాజుపాలెంకు చెందిన ఈశ్వరయ్యకు ఏడేళ్ల వయసులో పెద్దమ్మవారు (తట్టు) సోకడంతో మెదడు నరాలు బలహీనపడి కంటు చూపు లేకుండా పోయింది. కూలినాలి చేసుకుని బతికే తండ్రి అప్పట్లో అంటే 40ఏళ్ల క్రితం కర్నూలులో పరీక్షలు చేయించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అంధుడిగానే జీవితం కొనసాగించాలని నిర్ణయించుకున్న ఈశ్వరయ్య 1986లో కడప అంధుల పాఠశాల నుండి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించారు. రాయచోటిలో టిటిసి పూర్తి చేసి డిగ్రీ, తెలుగు, రాజనీతిశాస్త్రంలో డబుల్ ఎంఎ పూర్తి చేశారు. డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ వృత్తిలో 1996 సెప్టెంబర్ 13 నుండి కొనసాగుతున్నారు. చాపాడు మండలం నరహరిపురం, తిప్పిరెడ్డి పల్లిలో విధులు నిర్వహించి, 2009 నుండి మత్స్య కాలనీలో ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో 4,5 తరగతుల విద్యా ర్థులకు బోధిస్తున్నారు. పిల్లలకు విద్యాబోధన ఇంకా సులభతరం కావాలని తన సొంత నిధులు రూ.3వేలతో ఒక సహాయకుడిని ఏర్పాటు చేసుకున్నారు. ఆత్మవిశ్వాసం చాలా గొప్పదన్నారు. జీవితంలో ఎలాంటి ఆటంకాలు, అవరోధాలు ఎదురైనా వేటికీ వెరవకుండా ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించాలని ఈశ్వరయ్య సూచిం చారు.

వేంపల్లె : చూపులేని వారు విద్యను అభ్యసించడం కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగు నింపిన ప్రధాత లూయిస్ బ్రెయిలీ అని ఐఇఆర్‌టీలు రామాంజనేయురెడ్డి, యశోద పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది అంధులు విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, చిత్రకారులతోపాటు అనేక రంగాల్లో బ్రెయిలీ లిపితో అగ్ర భాగాన నిలిచారని తెలిపారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు కొత్తగా మంజూరైన ఫించన్లను అందజేశారు. మిఠాయిలను పంపిణీ చేశారు. ఫించన్లు మంజూరు చేసినందుకు ఎంఇఒ వీరారెడ్డికి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రికి పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. భవిత కేంద్రం ఫిజియోథైరపిస్ట్ ఆనంద్, సిఆర్‌పిలు ప్రకాష్‌రెడ్డి, నాగరాణి, కళ్యాణి, సూర్యకుమారి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : స్థానిక చిన్నన్న రూముల రోడ్డులోని భవిత స్కూల్‌లో బుధవారం బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రాజు పాల్గొన్నారు. మానవతా సంస్థ సభ్యులు, పట్టణ లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి సమకూర్చిన దుప్పట్లు, రిటైర్డ్ టీచర్ ప్రేమ్‌చంద్ కిషోర్ స్వీట్లు, పండ్లు విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేశారు. మానవతా సేవాసంస్థ అధ్యక్షులు డివి కొండారెడ్డి, విభిన్న ప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, భవిత స్కూలు రిసోర్స్ టీచర్లు ప్రకాశమ్మ, స్వాతి, కేర్ టేకర్ అరుణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రెయిలీ భాషలో చదువుతున్న ఈశ్వరయ్య

వేంపల్లె : ప్లేట్లు వితరణ చేస్తున్న ఐఇఆర్‌టిలు

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకశిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

పాఠశాలలో వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేకశిక్షణ ఇవ్వాలని ఎంఇఒ రవిశంకర్ సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యానికి సంబంధించిన మార్కుల రిజిస్టర్లను తనిఖీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహర్ మునీర్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ రవిశంకర్

భౌతిక దాడులకు దిగుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరుకు చెందిన టిడిపి నాయకులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ భౌతికదాడులకు దిగుతున్నారని వైసిపి కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, వంశీధర్‌రెడ్డి ఆరోపించారు. బుధ వారం సాయంత్రం వరికూటి ఓబులరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌రెడ్డి అండ చూసుకొని టిడిపి నాయకులు రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. శాంతియుతంగా ఉన్న ప్రొద్దుటూరలో టిడిపి నాయకులు అశాంతిని రేపుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆరోగ్యకరమైన రీతిలో రాజకీయం నడపాలని, లేని పక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. విలేకరుల సమావేశంలో వైయంఆర్ కాలనీకి చెందిన బాధితులు కిషోర్, అతని తల్లి, భార్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌన్సిలర్లు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొ న్నారు. మండల పరిధి లోని పి. గోపులాపురం గ్రామం లో బుధవారం ఆయన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్య క్రమాన్ని నిర్వ హించారు. ఈ సంద ర్భంగా భూపేష్ రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాన్ని వివరించారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపిందన్నారు. సంక్షేమం పేరుతో ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు తెచ్చిందని పేర్కొన్నారు. కానీ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేని దుస్థితి రాష్ట్రంలో ఉందని విమర్శించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, టిడిపి జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వరప్రసాద్ రెడ్డి, నల్లపురెడ్డి సుధాకర్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, రామాంజనేయులు యాదవ్, సుధాకర్ యాదవ్, రమేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న భూపేష్‌రెడ్డి

కాశినాయన వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక కాశినాయన వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖాజీపేట మండలం అచ్చన్నపల్లెకు చెందిన వెలిచెర్ల ప్రదీప్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన సన్నిహితులు ఈ కార్యక్రమం చేపట్టారు. విశ్వనాథపురం గ్రామా నికి చెందిన ఇరగంరెడ్డి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌రెడ్డి స్నేహితులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం : ఎస్‌పి

రాయచోటి టౌన్ : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషేధించామని, అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అన్నారు. బుధవారం ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడానికి వీలుగా ఉండే ప్రాంతాల దగ్గర్లోనే ఎక్కువ నేరాలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. అలాంటి ప్రాంతాలను ఆయా పరిధిలోని పోలీసు అధికారులు పంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో కలిసి చెత్తను, చెట్లను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ప్రజలు దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు కానీ, డయల్ 100కు కానీ సమాచారం అందించాలన్నారు.

అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అర్హతగల ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో బుధవారం జగనన్న పింఛన్ కానుక కార్యక్రమం ఎంపిపి హరిత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ఎన్నికల హామీలో ఇచ్చిన దానిలో భాగంగా ప్రతిదఫా రూ.250 పెంచుకుంటూ పోతున్నారన్నారు. ప్రస్తు తం ఈ నెల నుంచి పింఛన్ రూ.2750 ప్రతి అవ్వా, తాత, వితంతువులు తీసుకుంటున్నారన్నారు. పింఛన్ పోయిన వారు అధైర్య పడవద్దని సూచించారు. పోయిన ప్రతి పింఛన్‌ను పరిశీలించి అర్హత కలిగి ఉంటే తప్పకుండా మళ్లీ పున రుద్ధరిస్తారన్నారు. అనంతరం ఎంపిడిఒ అరుంధతి, ఎంపిపి హరిత, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరెడ్డి లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పింఛన్ లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శివపురం గ్రామ సచివాలయ పరిధిలోని డాంఖాన్‌పల్లి, డాం ఖాన్‌పల్లి ఎస్‌సి కాలనీ, ముత్తరాయపల్లి, నాగిరెడ్డి పల్లి, నడింపల్లి గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి థామస్, మండల వైస్ ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి, డాంఖాన్‌పల్లి సర్పంచు బండి చెన్నమ్మ, అన్నలూరు సర్పంచు మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అన్నలూరు ఎంపిటిసి సీర్ల గంగమ్మ, ఎంపిటిసి సుబ్బారెడ్డి, ఎంపిడిఒ కులాయమ్మ, తహశీల్దార్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

ఎపిటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు

ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్ 257) 2023 సంవత్సరానికి సంబందించిన డైరీ, కేలండర్, జిఒల సంపుటిని బుధవారం ఎంఇఒ వి.రవిశంకర్, ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఎపిటిఎఫ్ రూపొందించిన డైరీ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చాపాడు, చియ్యపాడు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యం.గౌస్‌మొద్దీన్, వి.సూర్యనారాయణ, ఎపిటిఎఫ్ చాపాడు మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రాజారెడ్డి, ఒవి వరప్రసాదరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు జిపి వెంకటేశ్వర్లు, బి కిషోర్, ఎంవి రామారెడ్డి, చాపాడు ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫైరోజ్ అహమ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతాయని జడ్‌పిటిసి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల నూతనంగా మంజూరు చేసిన కొత్త పింఛన్లను నలుపురెడ్డిపల్లె సచివాలయ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న పెన్షన్ కానుక కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పత్రాలను అందించారు. సిఎం జగన్ చిత్రపటానికి కొత్తగా పింఛన్లు పొందిన వారు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి, ఎంపిటిసి విశ్వనాథరెడ్డి, ఎంపిడిఒ రాజశేఖర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నీటి కనెక్షన్ కట్ చేయడం సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలో గల మంచినీటి కుళాయిల కనెక్షన్ కట్ చేయడంలో మున్సిపల్ ఎఇ వ్యవహారశైలి సరిగా లేదని సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ ఆరోపించారు. బుధవారం మైదుకూరు మున్సిపల్ ఎఇ తన సిబ్బందితో బద్వేల్ రోడ్డులోని బాలాజీ స్టిక్కరింగ్ షాప్ సందులోని 10 నివాస గృహాలకు నీటిపన్ను, ఇంటిపన్ను చెల్లించలేదని వారికి సమాచారం ఇవ్వకుండా కుళాయి కనెక్షన్లు కట్ చేశారని తెలిపారు. విషయం తెలుసుకున్న షరీఫ్ ఎఇని నిలదీయగా ఇంటి ఓనర్ పన్నులు చెల్లించని కారణంగా కనెక్షన్లు కట్ చేస్తున్నామని చెప్పారన్నారు. అనంతరం షరీఫ్ మాట్లాడుతూ ఇంటి ఓనర్ పన్నులు చెల్లించకుంటే ఇంట్లో బాడుగకు ఉండే వారి దృష్టికైనా తీసుకురావాలని అన్నారు. ఇలా చెప్పకుండా కనెక్షన్లు కట్ చేయడం సరికాదన్నారు. పన్నుల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులు మున్సిపాలిటీలో దుర్గంధం, వీధిలైట్లు, మురుగుకాల్వలు, చిన్నపాటి వర్షానికి మోకాళ్ళ లోతు నీరు నిల్వ ఉండే రోడ్లు, పందులు, ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండే వ్యర్థాల గురించి కూడా శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎఇ కనీస సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కుళాయి కనెక్షన్లు తొలగించబడిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - వేంపల్లె

పుణ్యక్షేత్రమైన గండి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో నిత్యా న్నదానినికి రూ.లక్షను దాతలు విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి చెప్పారు. బుధవారం గండి క్షేత్రంలో అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన రిటైర్డ్ టీచర్ తమ్మినేని చిన్నప్ప తన తల్లిదండ్రులైన ముత్యాలమ్మ, కంబన్న జ్ఞాపకార్థం రూ.1,00,116 అంద జేశారు. అనంతరం దాతలకు ఆలయం తరుపున ప్రత్యేక పూజలు చేసి సన్మానించారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముకుందరెడ్డికి విరాళం అందజేస్తున్న దాతలు

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి మెండు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతిలో సహజంగా లభించే ఎరువులతో పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చు.. అధిక దిగుబడి సాధించవచ్చని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని బడుగువారిపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగు చేసిన శనగ పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రపంచమంతా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతుందన్నారు. సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన ఉత్పత్తులకు మాత్రమే డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎపిసిఎన్‌ఎఫ్ఎస్ డిఎ వెంకటలక్ష్మి, మాస్టర్ ట్రైనర్ నుజహత్, సిఎ ముని భూపాలుడు, ఐసిఆర్‌పిలు రమణయ్య, శైలజ, రాధిక, శ్రీదేవి పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని పాత గోపిగారి సందులో ఉన్న ఎస్ఎస్ఆర్ఆర్ పాత లాడ్జిలో కె.బాలగంగి రెడ్డి (75) బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు.. బాల గంగిరెడ్డిది వల్లూరు మండలం ఇ కొత్తపల్లి గ్రామం. పులివెందులలోని ఎస్ఎస్ఆర్ఆర్ లాడ్జిలో పనిచేసుకుంటూ ఉండేవాడు. లాడ్జి మూసివేయడంతో పట్టణంలోనే పలుచోట్ల యాచిస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడని తెలిపారు. బుధవారం ఉదయం చిన్న రూంలో కిటికీకి ఉరి వేసుకున్నాడని తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా తరలించామన్నారు. ఆయన మేనల్లుడు శివారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.